


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 06-11-2022 సంపుటి : 04 సంచిక : 68 పేజీలు : 4 వెల : రూ 3-00


ఉద్రిక్తతల నడుమ పవన్ కల్యాణ్ ఇప్పటం పర్యటన

## గుంతలు పూడ్చలేరు.. రోడ్లు వేయలేరుగానీ.. విస్తరణ కావాలా?: పవన్ కల్యాణ్







మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గంలోని ఇప్పటం అనే చిన్న గ్రామంలో తెదేపా, జనసేన సానుభూతిపరులు, కార్యకర్తలకు చెందిన 53 ఇళ్లు, ప్రహరీలు కూల్చివేసిన విషయం తెలిసిందే.జనసేన ఆవిర్భావ సభకు స్థలం ఇచ్చామనే కక్షతోనే ఇళ్లను కూల్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇప్పటంలోని బాధితులను పరామర్శించి వారికి సంఘీభావం తెలిపేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయం నుంచి ఇప్పటం బయలుదేరారు. పవన్ పర్యటన దృష్ట్యా అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు పవన్ వెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆయన కారు దిగి కొద్ది దూరం కాలినడకన వెళ్లారు. కొద్ది దూరం వెళ్లాక తన వాహనంలో ఇప్పటం గ్రామానికి చేరుకున్నారు. పవన్‌కల్యాణ్‌ను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ జనసేన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇప్పటం చేరుకున్న జనసేనాని.. అక్కడ కూల్చివేసిన నివాసాలను పరిశీలిస్తున్నారు. పవన్ పర్యటన దృష్ట్యా ఇప్పటం గ్రామాన్ని పోలీసులు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ ప్రభుత్వానికి బుద్ధి ఉందా.. మేమేమన్నా గూండాలమా?ఇప్పటం చేరుకున్న పవన్ కల్యాణ్‌కు జనసైనికులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. అక్కడ కూల్చేసిన ఇళ్లను పరిశీలించిన జనసేనాని.. బాధితులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అక్కడే కొంత మంది బాధితులతో మాట్లాడారు. కూల్చివేతల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై బాధితులు పవన్‌కు వివరించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. "ఇప్పటం ఒక చిన్న గ్రామం. కాకినాడ లేదా రాజమహేంద్రవరమా రోడ్లు వెడల్పు చేయడానికి? ఎమ్మెల్యే ఆర్కే ఇల్లు ఉన్న పెదకాకానిలో రహదారి విస్తరణ ఎందుకు చేయడం లేదు. బాధితులతో కనీసం మాట్లాడకుండా ఆపడానికి మీరెవరు?మా సభకు ఇప్పటం గ్రామస్థులు స్థలం ఇచ్చారనే కుట్ర చేసి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైకాపా నేతలకు ఇదే చెబుతున్నా.. ఇడుపులపాయలో మేము హైవే వేస్తాం.గుంతలు పూడ్చలేరు.. రోడ్లు వేయలేరుగానీ.. విస్తరణ కావాలా? ఈ ప్రభుత్వానికి బుద్ధి ఉందా.. మేము ఏమన్నా గూండాలమా? అత్యాచారాలు చేస్తున్న వారిని పోలీసులు వదిలేస్తున్నారు. కూల్చివేస్తున్న వారికి పోలీసులు కొమ్ముకాస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు కూడా మా సోదరులే.. వారి కష్టాలు మాకు తెలుసు. పోలీసులు అడ్డుకున్నా జనసైనికులు మౌనంగా ముందుకెళ్లాలి. పోలీసులను ఏమీ అనొద్దు.. చేతులు కట్టుకొని ముందుకు నడవండి. ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసే పోరాటంలో వెనక్కి తగ్గేది లేదు. అరెస్టులకు భయపడేది లేదు.. దేనికైనా సిద్ధమే. వైకాపా వాళ్లకు చెబుతున్నా.. మా మట్టిని కూల్చారు. మీ కూల్చివేత తథ్యం" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.''ఇప్పటంలో ఇళ్లు కూల్చేస్తున్నారని తెలియగానే నేను తీసుకోలేకపోయాను. ఎవరు ఎదురు మాట్లాడినా వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. రేషన్ కార్డులు రద్దు చేస్తున్నారు. ఎంత కాలం ఈ అన్యాయం. చూస్తూ ఊరుకునేది లేదు. నలుగురు కిరాయి మూకలు ఉంటే భయపడతామా? అలాంటివారు ఎంత మంది ఉన్నా బెదిరేది లేదు. ఎంతమాత్రం వెనకడుగు వేసేది లేదు. ఎంత మంది ఎన్ని రెక్కీలు నిర్వహించినా ఏం జరగదు. ఎక్కడ ఎవరికి ఏం జరిగినా పూర్తి బాధ్యత సజ్జల రామకృష్ణారెడ్డిదే. ఆయనే పూర్తి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది" అని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు.

## కూల్చడం మాని ఏదైనా కట్టి చూడండి.. ఆ తృప్తే వేరు: చంద్రబాబు



అమరావతి: వైకాపా ప్రభుత్వం దిక్కుమాలిన పనులు చేస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు మండిపడ్డారు. శిశు పాలుడిలా సీఎం జగన్ చేసిన తప్పులు 100 దాటిపోయాయని..ఇక మిగిలింది ప్రభుత్వ పతనమే అని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ అంటే హింస, దాడులు, కూల్చివేతలు, అడ్డగింతలు, అక్రమ అరెస్టులు అన్నట్లుగా మార్చారని ఆక్షేపించారు. సీఎం జగన్ చేస్తున్న అరాచకాలకు జవాబు చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. "600 ఇళ్లు ఉన్న ఇప్పటం గ్రామంలో 120 అడుగుల రోడ్డు విస్తరిస్తారా?అంత అవసరముందా?. వైకాపా దుర్బుద్ధి, రాజకీయ కక్ష ప్రజలకు అర్థం కావడం లేదనుకుంటున్నారా?విస్తరణ అంటున్నారు.. అసలు ఏనాడైనా రహదారులు వేశారా? జనసేన అధినేత పవన్ పర్యటన అడ్డుకుంటేనో.. తెదేపా పర్యటన సమయంలో రాళ్లు వేస్తేనో పైచేయి సాధించలేరు. కూల్చడం మాని ఏదైనా కట్టి చూపించండి.. ఆ తృప్తి ఎలా ఉంటుందో తెలుస్తుంది" అని చంద్రబాబు తెలిపారు.

## భోగాపురం విమానాశ్రయం భూముల సేకరణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

అమరావతి నవంబర్ 5 విశాఖపట్నంలో ఏపీ హైకోర్టు జగన్ ప్రభుత్వానికి శుభవార్తను వినిపించింది. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి భూముల సేకరణకు హైకోర్టు గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. వీటిపై దాఖలైన అనుమతులను కొట్టేసింది.కాగా నవంబర్ 11న విశాఖ పర్యటనకు వస్తున్న నరేంద్ర మోడీ 12న విశాఖపట్నంలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ కూడా ఖరారైంది. కాగా ప్రధానమంత్రి కార్యాలయం భోగాపురం విమానాశ్రయంకు



శంకుస్థాపన అంశాన్ని ఆయన కార్యక్రమాల జాబితాలో చేర్చలేదని సమాచారం. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తుండటమే ఇందుకు కారణం.అయితే తాజాగా హైకోర్టు భోగాపురం భూసేకరణకు సంబంధించి దాఖలైన పిటిషన్లను కొట్టేయడంతో ఈ అంశాన్ని ప్రధాని మోడీ శంకుస్థాపన చేసే ప్రాజెక్టుల జాబితాలో చేర్చడానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తోంది. మొత్తం 14 ప్రాజెక్టుల వరకూ శంకుస్థాపనలో చేర్చినా వాటిలో 8 ప్రాజెక్టులకు మాత్రమే ప్రధాని కార్యాలయం అనుమతి ఇచ్చినట్టు సమాచారం. దీంతో మిగతా ప్రాజెక్టులను కూడా ఇందులో చేర్చేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.కాగా వాస్తవానికి భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ప్రభుత్వం 2019లోనే శంకుస్థాపన చేసింది. అయితే భూసేకరణకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది.భోగాపురం ఎయిర్పోర్టు భూసేకరణపై దాఖలైన పలు పిటిషన్లను హైకోర్టు నవంబర్ 4న కొట్టేసింది. గతంలో భూసేకరణ కోసం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ను సవాల్ చేస్తూ ఈ పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. మొత్తం 2700 ఎకరాల భూసేకరణ కోసం ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది.

## 'వందేమాతరం', 'జనగణమన'కు సమాన హోదా.. స్పష్టం చేసిన కేంద్రం




దిల్లీ: జాతీయ గీతం 'జనగణమన'కు, 'వందేమాతరం' గేయానికి సమాన హోదా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.జాతీయ గీతం 'జనగణమన'కి సమానమైన హోదాను 'వందేమాతరం' గేయానికి కూడా కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం తాజాగా స్పందించింది. దేశంలోని ప్రతి పౌరుడు ఈ రెండింటికి సమాన గౌరవం ఇవ్వాలని స్పష్టం చేసింది.జనగణమనకి, వందేమాతరానికి సమాన గౌరవం, హోదా కల్పించేలా మార్గదర్శకాలను రూపొందించేలా.. తగిన ఆదేశాలు ఇవ్వాలని దిల్లీ హైకోర్టులో కొద్దిరోజుల క్రితం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. భారత స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం కీలక పాత్ర పోషించిందని పిటిషనర్, న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో వందేమాతరానికి కూడా జనగణమనతో సమానమైన గౌరవం ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో ప్రతిరోజూ వందేమాతరం, జనగణమన పాడేలా తగిన ఉత్తర్వులు ఇవ్వాలని అశ్విని ఉపాధ్యాయ విజ్ఞప్తి చేశారు. కాగా విచారణలో భాగంగా.. ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాలని కేంద్ర హోం, విద్యా, సాంస్కృతిక, న్యాయ మంత్రిత్వ శాఖలకు దిల్లీ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై కేంద్రం తాజాగా స్పందిస్తూ.. ఆ రెండింటికి సమాన హోదా ఉంటుందని వెల్లడించింది.

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొలిటికల్ టూరిస్టులు: కొడాలి నాని



గుడివాడ: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మతి ఉంటే మాట్లాడుతున్నారా?. డీజిల్, గ్యాస్ రేట్లు రాష్ట్ర ప్రభుత్వం పెంచుతుందాపవన్, చంద్రబాబు వాళ్ల సమస్యలతోనే సతమతమవుతున్నారు అని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. శనివారం గుడివాడలో కొడాలి నాని మీడియాతో మాట్లాడుతూ.. 'జనసేన అధినేత పవన్ కల్యాణ్, చంద్రబాబు పొలిటికల్ టూరిస్టులు. హైదరాబాద్‌లో రెక్కీ డ్రామా జరిగినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సంబంధమా?. రెక్కీ పేరుతో పవన్ గాలిమాటలు మాట్లాడాడు. జూబ్లీహిల్స్‌లో రెక్కీ జరిగితే చంద్రబాబుకు ఏం సంబంధంఅప్పుడు పవన్ విశాఖలో ఐదు నానా హంగామా చేశారు. ఇప్పుడు ఇప్పటం వెళ్లి మరోసారి పవన్ నానా హంగామా చేశారు. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతుంటే టీడీపీకి నిద్రపట్టడం లేదు. కేపీ పాల్‌లా పవన్ ఇప్పటంలో పరుగులు పెట్టారు. మునుగోడులో కేఏ పాల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రక్తి కట్టించాడు. కేఏ పాల్ కన్నా వెనకబడిపోయానని పవన్ ఇప్పటం వచ్చాడు. షో అయిపోగానే 2 గంటల కల్లా వెళ్లిపోయారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలు ఎక్కడున్నాయి. లేని సమస్యలను పవన్, చంద్రబాబు సృష్టిస్తున్నారు. వారిద్దరూ వాళ్ల సమస్యలతోనే సతమతమవుతున్నారు. తాగుబోతులు పవన్ ఇంటి ముందు హడావుడి చేస్తే రెక్కీ అన్నారు. గులకరాయితో చంద్రబాబుపై హత్యయత్నం జరిగిందంట.. తనపై రాయి విసిరారని చంద్రబాబు డ్రామా చేస్తున్నాడు. చంద్రబాబే తన పార్టీ కార్యకర్తలతో రాళ్లు వేయించుకున్నాడు. పెట్రోల్, గ్యాస్ ధరలు రాష్ట్ర ప్రభుత్వం పెంచుతుందా?. ప్రధాని మోదీని అడిగే దమ్ము పవన్, చంద్రబాబుకు లేదు. పవన్ రాజకీయ అజ్ఞానిఇడుపులపాయలో హైవే వేయాలంటే పవన్ ప్రధాని అవ్వాలి. ప్రధాని అవ్వడం కోసం పవన్.. కేఏ పాల్‌తో పోటీ పడుతున్నాడా?. జనసేన తరపున 300 ఎంపీ సీట్లు గెలిచి ప్రధాని అవ్వమనండి. అప్పుడు ఇడుపులపాయలో కాదు. గుడివాడలో కూడా హైవే వేసుకోమనండి' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## పవన్ కల్యాణ్ పనికిమాలిన పిచ్చికూతలు కూస్తున్నాడు: మంత్రి జోగి రమేష్



ఇప్పటం: ఇప్పటంలో ఒక్క ఇల్లు కూడా తొలగించలేదు. రోడ్డు విస్తరణ కోసం ఆక్రమణలు మాత్రమే తొలగించాము. కళ్లుండి చూడలేని కబోది రామోజీరావు.ప్రభుత్వంపై విషం చిమ్ముతూ తప్పుడు రాతలు రాస్తున్నారు అని మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు.కాగా, మంత్రి జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పనికిమాలిన పిచ్చికూతలు కూస్తున్నాడు. పార్ట్-1 రెక్కీ, పార్ట్-2 రాయి, పార్ట్-3 ఇప్పటంలో పిచ్చి కల్యాణ్. ఇప్పటంలో రోడ్డు విస్తరణ కోసం ఆక్రమణలు మాత్రమే తొలగించాము. రోడ్ల నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోటీ చేసిన రెండు చోట్ల గెలవలేని అసమర్థుడు పవన్. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు.పవన్ ఇంటి వద్ద రెక్కీ అంటూ డ్రామా ఆడుతున్నారు. రెక్కీ నిర్వహించలేదని తెలంగాణ పోలీసులే చెప్పారు. చంద్రబాబు, పవన్ పనికిమాలిన వ్యక్తులు. మా ప్రభుత్వాన్ని ఇంచు కూడా కదల్చలేరు. చంద్రబాబు హయంలో వేల ఇళ్లను కూల్చేశారు. వందల ఆలయాలను చంద్రబాబు ప్రభుత్వం కూల్చివేసింది. గాంధీ విగ్రహాన్ని అర్ధరాత్రి కూల్చివేసిన చరిత్ర చంద్రబాబుది. కళ్లుండి చూడలేని కబోది రామోజీరావు. ప్రభుత్వంపై విషం చిమ్ముతూ తప్పుడు రాతలు రాస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

ఆదివారం 06-11-2022

## డెమోక్రసీలో ఓట్ ఫర్ సేల్ ట్రెండ్.

పొలిటికల్ పార్టీలు రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించాయి. ఎన్నికల ప్రక్రియనూ కలుషితం చేశాయి. ప్రత్యర్థి పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులను పదవులు, పైసలతో ప్రలోభ పెట్టడానికి మాత్రమే పరిమితం కాలేదు. ఓటర్లను ప్రభావితం చేయడానికి నోట్లను కుమ్మరిస్తున్నాయి. అనేక ప్రధాన పార్టీలకు ఇది కామన్ ప్రాక్టీసుగా మారిపోయింది. ఒక్కో ఓటరుకు ఎంత ముట్టచెప్పాలో రేటును ఫిక్స్ చేసుకుంటున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నట్లుగానే ఓటు రేటు కూడా పెరిగిపోతున్నది. ఇప్పుడు మునుగోడులో ఆ రేటు వేలల్లో పలుకుతున్నది. ఓటుకు నోటు పాత ట్రెండ్. ఓటుకు రేటు నయా ప్రాక్టీస్. 2018 అసెంబ్లీ ఎన్నికలలో ఉన్న రేటు దుబ్బాక ఉప ఎన్నిక నాటికి పెరిగింది. హుజూరాబాద్ బై పోల్ సమయానికి రెట్టింపైంది. ఇప్పుడు మునుగోడు ఉప ఎన్నిక టైమ్‌కు ఊహకు అందనంతగా ధర పలుకుతున్నది. పంపకాలలో ఒక పార్టీతో మరొకటి పోటీ పడుతున్నది. వేలం పాటలు బహిరంగంగా జరిగితే ఓటుకు ధర కట్టే విధానం గోప్యంగా సాగుతున్నది. ప్రత్యర్థి పార్టీకంటే వెయ్యి ఎక్కువే ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నాయి. ఎక్కడా సాక్ష్యాలకు, ఆధారాలకు దొరకకుండా చాపకింద నీరులా చీకటిలో జరిగిపోతున్నది. పార్టీలు ఇవ్వడం, ఓటర్లు పుచ్చుకోవడం ఒక హక్కు లాగానే అమలవుతున్నది. నోట్ల పంపిణీని ఎవరైనా అడ్డుకుంటే 'మా నోట్లో మట్టిగొట్టావు' అంటూ తిరగబడుతున్నారు. ఓటుకు నోటు తీసుకుంటే మనం అమ్ముడుపోయినట్లే, ఓటు వేయకపోతే చచ్చినవారితో సమానం. ఎవ్వరూ నచ్చకపోతే 'నోటా'కు ఓటేయొచ్చు. ఇలాంటివన్నీ మాటలకే పరిమితం. 'ఐ యామ్ నాట్ ఫర్ సేల్' అని ఎన్నికల కమిషన్ ప్రచారం చేస్తున్నా, 'మా ఓటును అమ్ముకోం' అని ఓటర్లు బోర్డులు తగిలించుకున్నా ప్రాక్టీసులో జరిగేది వేరు. పార్టీల లీడర్లే అంగట్లో సరుకులాగా అమ్ముడుపోతున్నారు. మార్కెట్ సరుకుగా మారిపోయింది. రాజకీయ వ్యవస్థే అలా తయారైంది. గెలవడమే లక్ష్యంగా, అధికారమే పరమావధిగా పార్టీలు పాకులాడుతున్నాయి. అందుకు అడ్డదారులు తొక్కుతున్నాయి. అవి చెడిపోయి ప్రజలనూ చెడగొడుతున్నాయి. పార్టీలకు, ప్రజలకు మధ్య 'ఎంతిస్తావ్, ఎంత పుచ్చుకుంటావ్' అనేదే కీలకం. విలువలు, సిద్ధాంతాలు, నైతికత ఇవేవీ అవసరం లేదు. లీడర్ల లాగానే ఓటు కూడా సంతలో సరుకైంది. 'వంద రూపాయలు సంపాదిస్తే ఇస్తున్నది ఒక్క రూపాయే, మిగిలినదంతా అక్రమంగా పోగేసుకుంటున్నదే. డిమాండ్ చేసి తీసుకోవడంలో తప్పేముంది. ఇస్తున్నది కూడా మా సొమ్మేగదా' అనే మాటలు ఇప్పుడు ఓటర్ల నుంచి డైరెక్టుగానే వినిపిస్తున్నాయి. ప్రజలు ఎమ్మెల్యేలను ప్రజా ప్రతినిధిగా చూడడంలేదు. ఎమ్మెల్యేలు కూడా ప్రజలకు ప్రతినిధులం అనే భావనతో లేరు. స్కీమ్‌లకు ఎంపిక చేయాలంటే కమిషన్లు ముట్టచెప్పుకోక తప్పడంలేదు. ఎన్నికలు వచ్చినప్పుడే పండుగ. ఎంత రాబట్టుకుంటే అంత. ఇదీ ఓటర్ల మైండ్‌సెట్. హుజూరాబాద్ ఉప ఎన్నికలో డబ్బులు రానందుకు ఓటర్లు రోడ్డెక్కి ధర్నా చేశారు. కొన్ని గ్రామాలలో ఒక్కో ఓటుకు పది వేలు ఇచ్చి మరికొన్ని చోట్ల ఆరు వేలే ఇవ్వడం గ్రామాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఎక్కువ, తక్కువ తేడా ఏర్పడింది. పది వేలు అందితేనే ఓటు వేస్తామంటూ బహిరంగంగానే ఓటర్లు డిమాండ్ చేశారు. ఇప్పుడు మునుగోడు పోలింగ్ సందర్భంగా ఒక్కో ఓటుకు రూ. 30 వేలు వస్తుందనే అంచనా వేసుకున్నారు. ప్రచారం ముగిసిన తర్వాత సైలెంట్‌గా జరిగిపోయిన మనీ డిస్ట్రిబ్యూషన్‌లో మూడు వేలే అందడంతో ఓటర్లు నారాజ్ అయ్యారు. హుజూరాబాద్ ఓటర్ల కంటే మేం పల్చనోళ్లమా అని ముఖంమీదనే నిలదీశారు. పార్టీపై ఉప ఎన్నిక ఫలితం చూపే ప్రభావానికి తగినట్లుగా ఓటుకు రేట్ ఫిక్స్ అవుతున్నది. మునుగోడు రిజల్ట్ చావో రేవో తేల్చేదనే భావిస్తున్న పార్టీ ఎంతైనా ఖర్చు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. అందుకే తులం బంగారం, 30 వేలు అంటూ లీకులు వచ్చాయి. చివరకు అది మూడు వేలకే పరిమితం కావడంతో ఓటర్లు నిరుత్సాహానికి గురయ్యారు. ఇది ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ మాత్రమే అని పార్టీ లీడర్లు సర్దిచెప్పాల్సి వచ్చింది. డబ్బులు ఇవ్వకుంటే ఓటు ఎందుకు వేయాలనే అభిప్రాయానికి వచ్చేశారు. 'మా ఓటును అమ్ముకోం' అని తమిళనాడు ఎన్నికల సందర్భంగా ఒక గ్రామం ఉమ్మడి నిర్ణయం తీసుకున్నది. ఇప్పుడు అది కాలం చెల్లిన విధానంగా మారిపోయింది'మేం అమలు చేసిన సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయని' అధికార పార్టీలు గర్వంగా చెప్పుకుంటున్నాయి. అయినా ఓటర్లను కొనడానికి డబ్బులు వెదజల్లుతున్నాయి. మద్యం మొదలు ర్యాలీలు, రోడ్ షో లకు లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. హాజరైన వారికి కిరాయి చెల్లిస్తున్నాయి. గెలుపు మాదేనంటూ ఎన్ని గొప్పలు చెప్పుకున్నా డబ్బులే నిర్ణయాత్మక శక్తిగా మారింది. పోలింగ్ టైమ్‌కు నోటు ఇవ్వకుంటే ఓటు పడదనే అభద్రతా భావానికి లోనవుతున్నాయి. ఎంత ఎక్కువ ఇస్తే ఓటు అంత పక్కా అని అనుకుంటున్నాయి. ఒకప్పుడు వంద నోటు, ఆ తర్వాత పచ్చ నోటు (రూ. 500), గులాబీ నోటు (రూ. 2000) ఇలా రంగులు మారుతున్నది. ఇప్పుడు మూడు వేల నుంచి 30 వేల దాకా డిమాండ్ ఏర్పడింది. సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీ మొదలు స్థానిక లీడర్లను లక్షలాది రూపాయలు పెట్టి కొంటున్నాయి పార్టీలు. ఒకరోజు ఒక పార్టీలో ఉంటే మరుసటి రోజు ఏ పార్టీలో ఉంటారో తెలియడం లేదు. ఎక్కడ ఎక్కువ రేటు ఉంటే అక్కడకు చేరిపోతున్నారు. వీటిని గమనిస్తూ ఉన్న ఓటర్లు మాకు ఇవ్వడానికి ఎందుకు వెనకాడుతున్నారంటూ ఓపెన్‌గానే నిలదీస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బు కాదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఓటు వజ్రాయుధం, బ్రహ్మాస్త్రం, తలరాతను మార్చే ప్రజాస్వామిక హక్కు. ఇలాంటివన్నీ మాటలకే పరిమితం. ఏ కులానికి ఎన్ని ఓట్లున్నాయో పార్టీలు లెక్కలేసుకున్నాయి.

# మరింత బలపడనున్న రాజకీయ బంధం

విజయవాడ, నవంబర్ 5 ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రోజురోజుకు వేడి పుట్టిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూసుకునే బాధ్యత తనదంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల తర్వాత ఏపీ రాజకీయాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటూ వస్తున్నాయి. ఒంటరిగా పోటీచేస్తే వైసీపీ పార్టీకి ప్రయోజనం ఉండొచ్చనే అంచనాలతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీచేస్తే తప్పకుండా వైసీపీ పార్టీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవచ్చనే ప్రచారం క్షేత్రస్థాయిలో జరుగుతుండటం, గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టీడీపీ, జనసేన లోపాయికారి పొత్తు పెట్టుకుని పోటీచేసిన చోట విజయం సాధించడం.. ఈ అంచనాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. దీంతో అధికారికంగా టీడీపీ, జనసేన మధ్య పొత్తులపై ప్రకటన రాకపోయినప్పటికి, క్షేతస్థాయిలో ఇరు పార్టీల నాయకులు పలు కార్యక్రమాల సందర్భంగా కలిసి పనిచేస్తున్న ఘటనలు ఇటీవల ఎక్కువగా చూస్తున్నాం. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ చేసే కార్యక్రమాలకు జనసేన, పవన్ కళ్యాణ్ తలపెట్టే కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మద్దతు తెలుపుతున్నారు. అలాగే ఇటీవల విశాఖపట్టణం ఘటనతో పాటు, తాజాగా పవన్ కళ్యాణ్ హత్యకు కుట్ర జరిగిందన్న ప్రచారం నేపథ్యంలో.. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా స్పందించడం, ఈ విషయంలో టీడీపీ నాయకులు పవన్ కళ్యాణ్ కు మద్దతుగా మాట్లాడటం కూడా రెండు పార్టీల మధ్య బలపడుతున్న బంధానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తాజాగా ఎన్టీఆర్ జిల్లా పరిటాలలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించింది. ఈకార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోలో తెలుగుదేశం పార్టీ జెండాలతో పాటు జనసేనపార్టీజెండాలుకన్పించాయి. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే అధికార వైసీపీ ప్రభుత్వం జనసేనాని పవన్ కళ్యాణ్ లక్ష్యంగా విమర్శలు చేసస్తూ వస్తోంది. తెలుగుదేశం పార్టీ, జనసేన రెండూ ఒకటేనని, చంద్రబాబునాయుడుడైరెక్షన్ లోనే పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారంటూ ఆరోపిస్తూ వస్తోంది. తాజాగా టీడీపీ కార్యక్రమంలో జనసేన జెండాలు కన్పించడంతో వైసీపీ జనసేనను మరింత టార్గెట్ చేసే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం బీజేపీ, జనసేన పొత్తులో ఉన్నప్పటికి, ఇటీవల కాలంలో ఇరు పార్టీల మధ్య స్నేహం వికటించిం దనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే దీనిని బీజేపీ నాయకులు ఖండిస్తూ వస్తున్నారు. పవన్ కళ్యాణ్ పార్టీతో తమ పొత్తు కొనసాగుతుందని చెబుతున్నారు. జనసేన మాత్రం ఈ విషయంలో ఆచీతూచీ అడుగులు వేస్తోంది. జనసేనాని పవన్ కళ్యాణ్‌తన టార్గెట్‌ను ఫిక్స్ చేసుకున్నారు. 2024 శాసనసభ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే ఆయన లక్ష్యమనే విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. దీంతో వైసీపీ కూడా పవన్ ను టార్గెట్ చేసింది. దీనిలో భాగంగా దమ్ముంటే పవన్ కళ్యాణ్ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ప్రకటించగలరా అంటూ వైసీపీ నాయకులు సవాల్ విసిరారు. అయితే ఇలాంటి సవాలు, ప్రతి సవాలుకు రాజకీయాల్లో పెద్ద విలువ ఉండదనేది జగమెరిగిన సత్యం. కాని పవన్ కళ్యాణ్ ను తమ సవాల్ కు కమిట్ చేయించాలని వైసీపీ నాయకులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నా.. జనసేనాని మాత్రం ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు. ఇటీవల విజయవాడలోని ఓ హోటల్ లో పవన్ కళ్యాణ్ తో చంద్రబాబు నాయుడు సమావేశమై పలు కీలక అంశాలను చర్చించిన విషయం తెలిసిందే. బయటకు రాజకీయాలు మాట్లాడలేదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించామని ప్రకటించినప్పటికి, రెండు పార్టీల అధినేతలు సమావేశమైనప్పుడు రాజకీయాంశాలు తప్పనిసరిగా చర్చకు వచ్చే ఉంటాయి. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు సమావేశం సందర్భంగా పొత్తులపై నిర్ణయం ప్రకటిస్తారని ఆశించినప్పటికి బహిరంగంగా ఆ ప్రకటన చేయలేదు. కాని ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి పనిచేయాలని ఇద్దరు నేతల నోట రావడంతో క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు, పార్టీ క్యాడర్ కు పరోక్షంగా పొత్తులపై సంకేతాలు ఇచ్చినట్లేనని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనాతెలుగుదేశంపార్టీవైసీపీప్రభుత్వానికివ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ జెండాలు కనబడటంతో ఆ పార్టీ ఆకర్యకర్తలుకూడా ఆ కార్యక్రమానికి హాజరై ఉండవచ్చు. ఈ అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గామారింది. త్వరలోనేపొత్తుల పైఅధికారికప్రకటనవచ్చేఅవకాశాలు లేకపోలేదనే చర్చ జరుగుతోంది. భవిష్యత్తురాజకీయంఎలా ఉంటుందనేది వేచి చూడాల్సిందే.

# గుంటూరు వైసీపీలో రాజకీయ ముసలం



గుంటూరు, నవంబర్ 5, గుంటూరు జిల్లా వైఎస్ఆర్‌సీపీలో అంతర్గత కుమ్ములాటలు బయటపడ్డాయి. జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా మాజీ మంత్రి మేకతోటి సుచరిత ప్రకటించారు. తన నిర్ణయాన్ని పార్టీ హైకమాండ్‌కు తెలిపానన్నారు. అయితే పార్టీకి మాత్రం రాజీనామా చేయడం లేదని తాను తన నియోజకవర్గం ప్రత్తిపాడుకు మాత్రమే పరిమితమవుతానని ప్రకటించారు. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో మేకతోటి సుచరిత పదవి పోయింది. మాజీ మంత్రులందరికీ జిల్లా అధ్యక్ష బాధ్యతలిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. అందులో భాగంగా మేకతోటి సుచరితగా గుంటూరు జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. అయితే పార్టీలో ఆమెకు ప్రాధాన్యం తగ్గిపోవడం అవమానాలు జరుగుతూండటంతో జిల్లా అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకున్నారు. వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు జగన్ వెంట మొదటి నుంచి నడిచారు మేకతోటి సుచరిత. ఆమె భర్త ఇన్‌కంట్యాక్ ఆఫీసర్. సుచరిత రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె తాడికొండ ప్రాంతానికి చెందిన వారైనా.. ప్రత్తిపాడు నుంచి రాజకీయం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో గెలిచిన వెంటనే జగన్ మంత్రి పదవి ఇచ్చారు. కీలకమైన హోంమంత్రి పదవిఇచ్చారు . అయితే రెండున్నరేళ్ల తర్వాత తర్వాత అందర్నీ తొలగిస్తానన్న మాట ప్రకారం జగన్ అందరితో రాజీనామాలు తీసుకున్నారు. అయితే కొంత మంది పాత వారిని మళ్లీ కేబినెట్‌లోకి తీసుకున్నా... మంత్రి వర్గ విస్తరణలో ఆమె స్థానం గల్లంతయింది. అంతకు ముందు హోంమంత్రిగా కీలక పొజిషన్‌లో ఉండేవారు. తనతో పాటు మంత్రులుగా ఉన్న వారిని కొనసాగించి కీలక పదవులు ఇచ్చినా తనను మాత్రం పక్కన పెట్టారని ఆమె అసంతృప్తికి గురయ్యారు. ఆమె ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసినట్లుగా ప్రచారం జరిగింది. ఆ తర్వాత జగన్ పిలిచి మాట్లాడటంతో చల్లబడ్డారు. తర్వాత జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. ఆమెను గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షురాలిగా నియమించినా .. ఆమెకు తెలియకుండానే అన్నీ జరిగిపోతున్నాయి. ఆమెను పట్టించుకునేవారు లేకుండా పోయారన్న అసంతృప్తికి గురయ్యారు. పార్టీ హైకమాండ్ తనను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ సమయంలో ... సుచరిత అసంతృప్తిని జగన్ తీవ్రంగా పరిగణించారని.. పార్టీ ఎన్నో అవకాశాలిచ్చినా.. తిరుగుబాటుకు ప్రయత్నించారన్న ఆగ్రహంలో జగన్ ఉన్నారంటున్నారు. ఈ సారి ప్రత్తిపాడు నుంచి కూడా ఆమెకు టిక్కెట్ ఇవ్వడం లేదని వైసీపీలో అంతర్గత ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో ఆమె వేరే పార్టీల వైపు చూస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఇదంతా వైసీపీలో తనపై జరుగుతున్న కుట్రగా ఆమె భావిస్తున్నారు. కారణం ఏదైనా సుచరిత మరోసారి అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం.. వైసీపీలో కలకలం రేపుతోంది.

# తిరుపతి లవ్ స్టోరీ.. మిస్సింగ్ లో కేసులు

తిరుపతి, నవంబర్ 5, (న్యూస్ పల్స్)అది అలిపిరి టోల్ గేట్. కొండపైకి వెళ్లే వాహనాలను సిబ్బంది తనిఖీ చేస్తూ ఉంటారు. ఇలా ఆగిన ఓ కారు నుంచి ఓ యువకులు దిగి పరుగెత్తుకుంటూ వెళ్లి సమీపంలో ఉన్న టీటీడీ విజిలెన్స్ అధికారులతో తనను ఆ కారులోని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకొచ్చారని ఫిర్యాదు చేశారు. దీంతో అలర్ట్ అయిన టీటీడీ విజిలెన్స్ ఆ కారు వద్దకు వస్తున్న సమయంలోనే రాంగ్‌రూట్‌లోకి పోనిచ్చి తప్పించుకునే ప్రయత్నం చేశారు. కారును ఛేజ్ చేసి ఎలాగోలా పట్టుకున్నా.. అందులో ఉన్న ఇద్దరు తప్పించుకునేందుకు కారు దిగి శేషా చలం అడవిలోకి పారిపోయారు. వారి మాత్రం ఆచూకీ లేరు. ఇప్పటికే రెండు రోజులు దాటిపోయింది. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులతో అలిపిరి తనిఖీ కేంద్రం నిత్యం రద్దీగా ఉంటుంది.. వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో కారు దిగిన యువకుడు తనను కిడ్నాప్ చేసారంటూ టిటిడి విజిలెన్స్ సిబ్బందిని ఆశ్రయించిన ఘటన తీవ్ర కలకలం రేపింది.. ముగ్గురిని అదుపులోకి తీసుకోవడం మరో ఇద్దరు వాహనంను టోల్ గేట్ లో ఆపకుండా ఘాట్ లోకి వెళ్ళి ఎస్కేప్ అయ్యేందుకు ప్రయత్నించారు.. దీంతో ఆ వాహనంను అలిపిరి టోల్ గేట్ సిబ్బంది మరోక వాహనంలో వెంబడించి లింక్ రోడ్డు సమీపంలో అడ్డుకున్నారు.. వాహనంను విజిలెన్స్ సిబ్బంది అడ్డుకోవడంతో ఆ ఇద్దరు యువకులు ప్రక్కనే ఉన్న లోయలోకి దిగ్గారు.. ఆక్టోపస్ సిబ్బంది, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది ఎంత వెతికినా ఆ ఇద్దరు ఆచూకీ మాత్రం లభించలేదు.. అదుపులో ఉన్న ముగ్గరిని రేణిగుంట పోలీసులకు అప్పగించారు విజిలెన్స్ అధికారులు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన రాహుల్ చైతన్య, అదే ఊరికి చేందిన ప్రవల్లిక మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు.. అయితే కొద్ది రోజుల వరకూ అన్యోన్యంగా ఉన్న వీరిద్దరూ మనస్పర్థల కారణంగా గత కొద్ది రోజులుగా దూరంగా ఉంటున్నారు.. వృత్తి రిత్యా రాహుల్ చైతన్య తిరుపతి జిల్లా, రేణిగుంటలోని గౌరినగర్‌లో నివాసం ఉంటున్నాడు.. రాహుల్ చైతన్య ,ప్రవల్లిక కుటుంబ సభ్యులు ఇద్దరికి సర్ది చెప్పడంతో ప్రవల్లికను రేణిగుంటలీ కాపురం పెట్టేందుకు ఒప్పుకున్నాడు.. అప్పటి నుండి ప్రవల్లిక తన భర్త రాహుల్ చైతన్యతో ఫోన్లో సంభాషిస్తూ వచ్చేది.. ఈక్రమంలో వారం క్రితం రాహుల్ చైతన్య పుట్టిన రోజు రావడంతో ప్రవల్లిక తన భర్తకు సర్ప్రైజ్ చేసేందుకు రేణిగుంటకు వచ్చింది. ప్రవల్లిక వచ్చిన సమయంలో రాహుల్ చైతన్య మరోక మహిళతో సన్నిహితంగా ఉండడంను చూసిన ప్రవల్లిక తీవ్ర మనోవేదనకు గురై తిరిగి రాజమండ్రికి వెళ్ళి జరిగిన విషయంను కుటుంబ సభ్యులకు తెలియజేసింది.. ప్రవల్లిక అన్న తాను స్నేహితులతో కలిసి తిరుమలకు వెళ్తున్నాని, ఇదే విషయంను రాహుల్ తో మాట్లాడుతానని చెప్పి ఒదార్చాడు.. తిరుమల యాత్రకు స్నేహితులతో కలిసి బయలుదేరిన ప్రవల్లిక సోదరుడు రేణిగుంటకు చేరుకుని రాహుల్ చైతన్యకు ఫోన్ చేసిన తాను తిరుమలకు వెళ్తున్నానని తాను కూడా తనతో రావాలని కోరాడు. ఇలా వేరే అమ్మాయితో సన్నిహితంగా ఉండటం గురించి ఎవరికీ తెలియదనుకున్న రాహుల్ చైతన్య కారు ఎక్కాడు. కానీ కారులో తన చెల్లి రేణిగుంటకు వచ్చిన సమయంలో మరోక మహిళతో ఉండడంను ప్రవల్లిక సోదరుడు రాహుల్ చైతన్యతో ప్రస్తావించాడు. దీంతో తనను కొడతారని భయపడిన రాహుల్ చైతన్య అలిపిరి టోల్ గేట్ చేరుకోవడంతో కారు దిగి తనను కిడ్నాప్ చేసారంటూ గెట్టి గెట్టిగా కేకలు వేస్తూ అక్కడే ఉన్న టిటిడి విజిలెన్స్ సిబ్బందిని ఆశ్రయించడంతో అసలు సీన్ ప్రారంభమయింది. రాహుల్ చైతన్యను పట్టుకునేందుకు వచ్చిన లోకేష్ ,గణేష్, రాజేష్ లను టిటిడి సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.. దీనిని గమనించిన కారు డ్రైవర్ వేంటనే కారును టోల్ గేట్ లో ఆపకుండా రెండోవ ఘాట్ రోడ్డులోకి పోనిచ్చాడు.. మరోక వ్యక్తి కూడా టోల్ గేట్ దాటి వాహనంను ఎక్కి ఘాట్ రోడ్డులో వేగంగా పోనిచ్చారు.. అయితే ఆ వాహనంను వేంబడించిన టిటిడి విజిలెన్స్, పోలీసులు రెండోవ ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు వద్ద అడ్డుకున్నారు.. అయితే తమను ఎక్కడ అరెస్టు చేస్తారోనని భయపడిన ఆ ఇద్దరు యువకులు ప్రక్కనే ఉన్న లోయలోకి దిగి పరార్ అయ్యారు..వీరిద్దరిని ఆక్టోపస్ దళాలతో బుధవారం రాత్రి నుండి గురువారం మధ్యాహ్నం వరకూ శేషాచలం అటవీ ప్రాంతంలో గాలించారు.. కానీ ఆ ఇద్దరి ఆచూకీ లబించక పోవడంతో అదుపులో ఉన్న ముగ్గరిని అలిపిరి పోలీసులకు అప్పగించారు.. ఈకేసులో ప్రవల్లిక ఇచ్చే సమాచారంను కీలకం కావడంతో ఆమెను అలిపిరి పోలీసులకు పిలిపించారు.. ఈ కేసు తమ పరిధి అయినప్పటికీ రేణిగుంట పోలిసులు దర్యాప్తు చేయాలని అలిపిరి పోలీసులు, అనడంతో రేణిగుంట పోలీసులు తమ పరిధి కాదని అంటున్నారు.. అదుపులో ఉన్న ముగ్గరిపై కేసు నమోదు చేయాలా వద్దా నే విషయంపై పోలీసులు తర్జన భర్జన పడుతున్నారు..

# ఇప్పటంలో ఉద్రిక్తత

తాడేపల్లి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గుం టూరు జిల్లా తాడేపల్లి ఇప్పటం పర్య టన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. పవన్ వాహనాలను ముందగానే పోలీసులు అడ్డుకున్నారు. అడుగడు గునా ఆంక్షలు విధించారు. దీంతో జనసైనికులు పోలీసులకు తీవ్ర వాగ్వా దం చోటు చేసుకుంది. దీంతో పవన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ.. మంగ ళగిరి నుంచి ఇప్పటం వరకు పాద్ర యాత్ర ప్రారంభించారు. మధ్య మధ్య లో పోలీసులు ఆంటకాలను దాటు కుంటూ ఆయన ఇప్పటానికి చేరుకు న్నారు. పోలీసుల తీరుపై పవన్ కళ్యా ణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇప్పటంవెళ్లేదారి అడుగడునా పోలీసు లు మోహరించి ఉండడాన్ని పవన్ తప్పు పట్టారు. బాధితులకు అండగా నిలబడాలి అనుకోవడంకూడా నేరమా అంటూ ప్రభుత్వాన్ని పవన్ ప్రశ్నించారు.

# విశాఖలో పరువు హత్య

విశాఖపట్నం విశాఖలో దారుణం చోటు చేసుకుంది. కన్న కూతురినే కడతేర్చాడు కసాయి తండ్రి. విశాఖ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రెల్లి వీధి లో పరువు హత్య జరిగింది. వర ప్రసాద్ అనే వ్యక్తి తన కూతురు లిఖిత శ్రీ తన మాట వినకుండా ఒక అబ్బాయి తో ప్రేమలో పడింది అనే కోపం తో హత్య చేశాడు. ఆ పై మృత దేహం ప్రక్కనే నిలబడి సెల్ఫి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అనంతరము పోలీస్ స్టేషన్ లో లొంగి పోయాడు. ప్రస్తుతము ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తన కూతురు ని అల్లార ముద్దు గా పెంచానని, చదువు కి, క్రీడలు కి కావలసిన డబ్బు లు ఖర్చు చేసి చాలా గారాబంగా పెంచుతున్నట్లు తెలిపాడు. తన మాట వినకుండా ఒక అబ్బాయి తో ప్రేమలో పడటం తనకు నచ్చక హత్య చేశానని వివరించాడు.

# కౌంటింగ్ కు సర్వం సిద్ధం

నల్గొండ, నవంబర్ 5, (న్యూస్ పల్స్) దేశంలోనే అత్యధిక ఖరీదైన ఉపఎన్నిక అయిన మునుగోడు నియోజకవర్గ ఫలితాలు ఈనెల 6వ తేదీ ఆదివారం వెల్లడికానున్నాయి. ఆరోజు మధ్యాహ్నం వరకూ వేచి చూస్తే కొత్త ఎమ్మెల్యే ఎవరో తేలిపోనుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావిలోని గోడన్లలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు, ఆరోపణలు, డ్రామాలు, దాడులు, మద్యం, డబ్బు మధ్య కొనసాగిన బై పోల్ ఫలితాల కోసం దేశవ్యాప్తంగా ఆత్రుతగా ఎదురు చూస్తోంది. 6వ తేదీన ఉదయం 8 గంటలకు కౌటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీని కోసం 21 టేబుళ్లు ఏర్పాటు చేసి, 15 రౌండ్లలో, 298 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను పూర్తి చేస్తారు. ప్రతి రౌండ్ లో 21 పోలింగ్ స్టేషన్ల ఓట్లను లెక్కిస్తారు. మొదట పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమును ఓపెన్ చేసి, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. మునుగోడులో 686 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తైన తర్వాత ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్ కి కౌంటింగ్ సూపర్ వైజర్, అసిస్టెంట్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు విడుదలవుతుంది. చివరి రౌండ్ ఫలితం ఒంటి గంటకు వెల్లడికానుంది. ఇలా15 రౌండ్లలో 298 పోలింగ్ కేంద్రాల్లో పోలైన అన్ని ఓట్లు లెక్కిస్తారు. మొదటగా చౌటుప్పల్ మండలం, నారాయణపురం, మునుగోడు, చందూర్, మర్రిగూడం, నాంపల్లి, గట్టుప్పల్ మండలాల ఓట్లు లెక్కించనున్నారు. కౌంటింగ్ లో పాల్గొనే సిబ్బందికి మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి వినయ్ కృష్ణారెడ్డి, ఆర్వో రోహిత్ సింగ్, సెంట్రల్ నుంచి వచ్చిన ముగ్గురు పరిశీలకుల పర్యవేక్షణలో ఈ కౌటింగ్ ప్రక్రియ జరుగుతుంది. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఆర్పీఎఫ్ బలగాలతో, సీసీ కెమెరాల పర్యవేక్షణలో 24 గంటలపాటు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో 93.13% పోలింగ్ నమోదు అయిన విషయం తెలిసిందే. కౌంటింగ్ కోసం ప్రతి పార్టీ నుంచి 21 మంది కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకునేలా అధికారులు అనుమతి ఇచ్చారు. అత్యధిక ఖరీదైన ఉప ఎన్నిక జరిగిన మునుగోడు రేపు నల్లగొండ జిల్లా కేంద్రం వైపు చూడనుంది. అందరూ టీవీలకు అతుక్కుపోనున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో దేశం మొత్తం నల్లగొండ వైపు చూడనుంది. ఎందుకంటే రూ. కోట్లలో బెట్టింగులు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతి తక్కువగా రూ. 10 వేల నుంచి లక్షల రూపాయాలతో బెట్టింగ్ పాల్పడుతున్నారు. కొంతమంది భూములు పెట్టి పందెం కాస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## పందుల తరలింపు వద్దనిఆందోళన

రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి క్వారీ మార్కెట్ కూడలిలో ఎరకుల కులస్థులు ఆందోళనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా పెంచుకుంటున్న తమ పందులను మున్సిపల్ అధికారులు తమిళనాడు రాష్ట్రానికి అమ్మేస్తున్నారనీ ఆరోపించారు. అడ్డుకున్న తమపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారనీ పందుల యజమానులు ఆవేదన చెందుతున్నారు. తమకు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్లయితే పందులను అక్కడే పెంచుకుంటామంటని అంటున్నారు. పందులను తరలిస్తున్న వాహనం కు అడ్డంగా బైఠాయించి ఆందోళనకు దిగారు.

## అందరికీ ధన్యవాదాలు

అనకాపల్లి సిఐడి అరెస్టుకు నిరసనగా నర్సీపట్నంలో స్వచ్ఛందంగా బంద్ ప్రకటించిన అన్ని వర్గాల ప్రజలకు టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు ధన్యవాదాలు తెలిపారు. విలేకరులకుపంపిన వీడియోలో ప్రజలకు ధన్యవాదాలు తెలియజేసారు. ఉన్నతాధికారులు ఒత్తిడి ఉన్నా, స్కూల్స్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు సైతం బంద్ లో పాల్గొన్నందుకు రుణపడి ఉంటానని అయన అన్నారు. ..

## మొబైల్స్ రికవరీ

కర్నూలు కర్నూలు జిల్లాలో మిస్సింగ్ అయిన మొబైల్ ఫోన్లను లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ ద్వారా ఫోన్లు పోగొట్టుకున్న యజమానులకు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో అందజేశారు. కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ రికవరీ మేళా ద్వారా జిల్లాలో నమోదైన మొబైల్ మిస్సింగ్ కేసులను సైబర్ రికవరీ టీమ్ దర్యాప్తు చేసి సుమారు 1060 మొబైల్ ఫోన్స్ ను ట్రాక్ చేశామని, గతంలో 600 మొబైల్స్ రికవరీ చేసి వినియోగదారులకు ఇచ్చామని, ఎవరైన మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే ఆన్లైన్లో కంప్లైంట్ చేస్తే చాలు మొబైల్ ని రికవరీ చేసి ఇస్తామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు.

## కోళ్లను మింగుతున్న కొండచిలువ

నెల్లూరు చికెన్ లవర్ ఈ కోండ చిలువ..కోళ్లతో పాటు పిల్లులు,కుక్కలను తినేసేది. గ్రామంలో కోళ్ళ మయాం అవుతుండటంతో నాటు కోళ్ల దొంగలు ఎవరా అని ఒకరి పై ఒకరి అనుమానం పడ్డారు. ఫైనల్ గ కోళ్ల ని తినేది,మింగేసిది కొండచిలువ అని కోట్టి చంపారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం బీసీ కాలనీ సమీపంలో వెంకయ్య స్వామి గుడి దగ్గర కొండచిలువ హల్ చల్ చేసింది....గుడి సమీపంలో పూరిగుడిసెల్లోకి కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళన తో పరుగులు తీశారు....కొండచిలువ రావడంతో స్థానికులు కొందరు అక్కడకు చేరుకుని దానిని తాడుతో కట్టి సమీపంలోని చెరువులో పడవేశారు....ఇదే ప్రాంతం లో గత రాత్రి శివాలయం వీధిలో గల గిరిజన నివాస గృహాల వద్ద ఎనిమిది అడుగుల పొడవున్న కొండచిలువ హల్చల్ చేసింది...పిల్లిని మింగేందుకు ప్రయత్నించగా పిల్లి కేకలు వేయడంతో గుర్తించిన స్థానికులు కొండచిలును కొట్టి చంపారు....దీనితో ఒకే రోజు వ్యవధిలో రెండు కొండచిలువలు హల్ చల్ చేయడం తో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు....గత కొన్నిరోజులుగా ఈ ప్రాంతంలో కోళ్లు కనపడకుండా పోతున్నాయని...కొండ చిలువలే కోళ్లను తింటున్నట్లు తెలిసింది.

## ట్రిబుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్

శ్రీకాకుళంట్రిబుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటు చేసకుంది. రాజీవ్గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో శుక్రవారం పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం నుంచి కొందరు విద్యార్థులు కడుపునొప్పి అంటూ వాంతులు చేసుకున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు క్యాంపస్లోనే ప్రాథమిక వైద్యసేవలు అందించారు. ప్రాంగణంలో మొత్తం 3,200 మంది విద్యార్థులు ఉండగా సాయంత్రానికి 150 మంది అస్వస్థతకు గురైనట్లు సమాచారం. వీరికి క్యాంపస్లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంకావడంతో శుక్రవారం అర్ధరాత్రి శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. తాగునీరు కలుషితం కావడంతో ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న మీడియాను లోపలకు అనుమతించలేదు. అసలేం జరిగిందనే విషయం చెప్పేందుకు నిరాకరించారు. దీనిపై ట్రిపుల్ ఐటీ డైరెక్టరు జగదీశ్వరరావును వివరణ కోరగా అటువంటిదేమీ లేదంటూ దాటవేశారు.

## భోగాపురం ఎయిర్ పోర్టు పనులు ప్రారంభం

విజయనగరం, నవంబర్ 5, విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. ఉత్తరాంధ్రలో అతి పెద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుగా భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అడుగులు వేసింది. అయితే బాధిత రైతులు పరిహారం విషయంలో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణలో గతంలో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసింది. అలాగే రైతులు దాఖలు చేసిన పిటిషన్లను కూడా ధర్మాసనం కొట్టివేసింది. దీంతో భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి మోక్షం కలిగినట్లైంది. త్వరలోనే గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయి. మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తే పనులు ప్రారంభించాలని ఇప్పటికే ప్రభుత్వం యోచిస్తుంది. అయితే హైకోర్టు అన్ని పిటిషన్లు కొట్టివేయడంతోపాటు మధ్యంతర ఉత్తర్వులను సైతం ఎత్తివేయడంతో మార్గం సుమగం కానుంది. ఇకపోతే దాదాపుగా 2,500 ఎకరాల విస్తీర్ణంలో భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణం కానుంది. తొలుత టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసినప్పటికీ భూసేకరణ సమ్యసలు తలెత్తడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం పరిహారం విషయంలో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టులో విచారణ జరుగుతుంది. ఇదిలా ఉంటే విశాఖపట్నం ఎయిర్ పోర్టును కూడా భోగాపురానికి తరలించేందుకు నావికాదళం సైతం అంగీకరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఢిల్లీలో నౌకాదళం-ఏపీఏడీసీఎల్ల మధ్య ఎంవోయూ సైతం జరిగింది. అయితే విశాఖపట్టణం విమానాశ్రయానికి సంబంధించిన 170 ఎకరాల భూమిని నౌకాదళానికి ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది.

# మత్తుకు యువత దాసోహం





పెద్దాపురం కాలేజీకి వెళ్ళి చదువుకుని ఫ్యూచర్ పై దృష్టి సారించాల్సిన యువత మధ్యకద్రవ్యాల మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అయితే మాదకద్రవ్యాలకు రవాణా, వినియోగం పై ఉ క్కుపాదం మోపాల్సిన అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణంలో ఇటీవల కాలంలో గంజాయి వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. పట్టణంలోని కొంత మంది యువకులు గ్రూపులుగా చేరి పట్టణ శివారు ప్రాంతాల్లోని పుంతలు, పాడుబడ్డ భవనాలు, శ్మశాన వాటికలలో గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారు. ఈ చర్యలకు పాల్పడే వారు 25 సంవత్సరాలలోపువారే కావడం ఆందోళన కలిగించే విషయం... చాపకింద నీరులా వీటిని వినియోగించే వారి సంఖ్య రోజు రోజుకూ పెరగడంతో విక్రయదారులకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారం సాగుతోంది. ఏజన్సీ ప్రాంతాల నుండి కిలోల లెక్కన గంజాయిని తీసుకొచ్చి చిన్న చిన్న పొట్లలలో విక్రయిస్తున్నారు. చైన్ లింక్ తరహాలో ఈ విక్రయాలు చేస్తూ పోలీసులకు దొరకకుండా అక్రమార్కులు కొత్త దారులు వెతుకుతూ యువత భవితను నాశనం చేస్తున్నారు. అక్టోబర్ 30 వ తేదీ రాత్రి సామర్లకోట పట్టణానికి చెందిన సికోలు సత్తిబాబు అనే వ్యక్తిని ఓ యువకుడు రాత్రి సమయంలో మద్యం ఇప్పిస్తానని చెప్పి పట్టణంలోని శివారు ప్రాంతానికి తీసుకెళ్లి... అక్కడే ఉన్న మరికొందరితో కలిసి గంజాయి సేవించి సత్తిబాబు పై బీరు బాటిల్తో తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తర్వాత ఆ యువకుడు ఎవరో మహిళకు ఫోన్ చేసి నీకు ఇక సత్తిబాబు గొడవ ఉ ండదని చెప్పి రక్తపు మడుగులో ఉన్న తనను పలుమార్లు దాడి చేశాడని బాధితుడు మీడియా ముందు వాపోయాడు. తరువాత సత్తిబాబు కుమారుడికి ఫోన్ చేసి రమ్మని చెప్పి దాడి చేసిన ప్రాంతం నుండి సామర్లకోట గోదావరి కెనాల్ వద్దకు తీసికెళ్ళి స్నానం చేయించి మరోమారు కొడుకు ముందే తండ్రిపై దాడి చెయ్యడమే కాకుండా జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే సత్తిబాబు కుమారుడికి కూడా ఇదే గతి పడుతుందని బెదిరించి తండ్రి కొడుకులిద్దరిని వాళ్ళ ఇంటి సమీపంలోని ఓ ఇంటి గట్టుపై పడుకోబెట్టి ఆ యువకులు వెళ్లిపోయారు.... విషయం తెల్సుకున్న బంధువులు సత్తిబాబును అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి మర్నాడు ఉదయం సామర్లకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ రోజులు గడుస్తున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని బాధితుడి భార్య వాపోయింది. తమకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేస్తోంది. ఇదిలావుండగా గంజాయి, విలాసాలకు బానిసైన ఓ యువకుడు సామర్లకోటలో ఓ యువకుడి దగ్గర తన అవసరాల నిమిత్తం 10వేల రూపాయలకు తన వద్దనున్న ఖరీదైన బైక్ ను తాకట్టు పెట్టాడు. అయితే తాకట్టు పెట్టిన బైక్ ను విడిపించేందుకు వెళ్ళిన బైక్ ఓనర్ కు 70 వేల రూపాయలు కడితే బైక్ ఇస్తామని లేదంటే బైక్ ఇచ్చేది లేదని చెప్పడంతో ఇరువర్గాలు బైక్ విషయంలో ఘర్షణ జరిగి ఒకరిపై మరొకరు పెద్దాపురం పీఎస్ లో ఫిర్యాదు చేసుకున్నారు. గంజాయికి సంబంధించిన లావాదేవీల్లోనే 70 వేల రూపాయలు గొడవ జరిగిందని పోలీసు విచారణలో తెలినప్పటికి గంజాయి అమ్మకాలు చేసింది ఎవరనే దానిపై పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. అయితే గంజాయి విక్రయాలు చేస్తోంది ఎవరనేది బైక్ ఓనర్ కానీ బైక్ తాకట్టు పెట్టుకున్న వ్యక్తి కానీ చెప్పకపోవడం గమనార్హం..గంజాయి, మాదకద్రవ్యాల అమ్మకాలు, వినియోగం పై నిఘా పెట్టేందుకు పోలీసులు అంతగా ఆసక్తి చూపించడం లేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరత, పని ఒత్తిడితో పాటు గంజాయి కేసు నమోదు చేస్తే పెద్ద ఎత్తున రికార్డ్ వర్క్ చెయ్యడమే కాకుండా ఎక్కువ సమయం వెచ్చించాల్సి రావడం లాంటి కారణలతోనే పోలీసులు గంజాయి కేసుల్లో అలసత్వం వహిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు గంజాయి, మాదకద్రవ్యాల అమ్మకాలు, వినియోగం పై నిఘా పెట్టి యువత పెడదోవ పట్టకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు నేతలు కోరుతున్నారు.

# కేసీఆర్ కామెంట్స్ పై రాజకీయ అలజడి

విజయవాడ, నవంబర్ 5, తెలంగాణలోని అధికార పార్టీ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం కేసు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ అంశంలో తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని రానున్న రోజుల్లో కుట్రదారుల బాగోతం అంతా బట్టబయలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రెస్ మీట్ లో చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయాలనుకుంటోందని ఈ విషయంపై సీజేఐతో పాటు అన్ని రాష్ట్రాల హైకోర్టులకు విజ్ఞప్తి చేస్తున్నాను. దేశంలోని రాజకీయ పక్షాలు, యువత, మేధావులు ఆలోచన చేయాలి. ఇప్పటికే ఎనిమిది ప్రభుత్వాలను కూల్చివేసిన బీజేపీ మరో నాలుగు రాష్ట్రాల్లోనూ కుట్రలు చేసేందుకు సిద్ధంగా ఉంది' అని కేసీఆర్ చెప్పడం సంచలనంగా మారింది. తెలంగాణ, ఢిల్లీ, రాజస్థాన్ తో పాటుగా ఏపీలోని జగన్ సర్కార్ ను గద్దె దించేందుకు కమలనాథులు కసరత్తు చేస్తున్నారన్న కేసీఆర్ కామెంట్స్ పై ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంది. కేసీఆర్ వ్యాఖ్యలతో జగన్ రియాక్షన్ ఎలా ఉండబోతోంది అనేది ప్రస్తుతం అందరిలో ఉత్కంఠ రేపుతున్నది. తమ ప్రభుత్వంపై బీజేపీ కుట్ర చేస్తోందని కేసీఆర్ చెప్పడం వెనుక కేసీఆర్ అలర్ట్ చేస్తున్నారా లేక ఆయన అవసరానికి తమను ఉపయోగించుకోవాలని చూస్తున్నారా అనేద వాదన కూడా వైసీపీ వర్గాల్లో చర్చకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో జగన్ ప్రభుత్వానికి బంపర్ మెజార్టీ ఉంది. 175 అసెంబ్లీ స్థానాల్లో 151 సీట్లు వైసీపీవే. ఇక్కడ ప్రభుత్వాన్ని కూల్చడం అంటే చెప్పినంత సులువుగా జరిగే పని కాదనేది రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట. సంఖ్య బలం అటు ఇటుగా ఉంటే అలాంటి ప్రయత్నాలు చేయవచ్చునేమో కానీ జగన్ ప్రభుత్వానికి అవసమైన మ్యాజిక్ ఫిగర్ కంటే 63 సీట్లు ఎక్కువగా ఉన్నాయి. పైగా ఒక్క సీటు కూడా లేని బీజేపీ ఈ టాస్క్ ను ఎలా ముందుకు తీసుకుపోతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వంతో జగన్ సర్కార్ సఖ్యతగానే మెసులుకుంటోంది. కేంద్రం తీసుకుంటున్న అనేక నిర్ణయాలను సమర్థిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ చేసిన కామెంట్స్ పై ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాక ఆరంభ దశలో కేసీఆర్ కు జగన్ కు మధ్య సఖ్యత వాతావరణం ఉండేది. కానీ ఆ తర్వాత ఇద్దరి మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వంతో కేసీఆర్ దూరం అవడం అదే సమయంలో జగన్ మోడీతో సత్సంబంధాలు కొనసాగిస్తుండటంతో ఆ ఎఫెక్ట్ వీరిద్దరి మధ్య పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జగన్ ప్రభుత్వంపై తెలంగాణ మంత్రులు తరచూ టార్గెట్ చేస్తున్నారు. మోడీపై పోరాటం చేస్తుంటే తమకు జగన్ మద్దతుగా కలిసి రాకపోవడంతోనే టీఆర్ఎస్ నేతలు తరచూ ఇలా అనవసరపు వివాదాల్లోకి లాగుతున్నారనేది వైసీపీ వర్గాల్లో వినిపిస్తున్న మాట. టీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై ఇప్పటి వరకు వైసీపీ మంత్రులే స్పందిచారు. కానీ జగన్ ఒక్క సారి కూడా రియాక్ట్ అవ్వలేదు. ఈ సారి మీ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ఢిల్లీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారని కేసీఆర్ చేసిన అలర్ట్ పై జగన్ రియాక్ట్ అవుతారా? లేక ఈ వ్యాఖ్యల వెనుక తమను వారి వైపు తిప్పుకునే కోణం ఉందని భావించి లైట్ తీసుకుంటారా అనేది సస్పెన్స్ గా మారింది.

# గంటా ఏ పార్టీలో ఉన్నట్టు



శాఖపట్టణం, నవంబర్ 5, విశాఖ నార్త్ ఎమ్మెల్యే.. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వైఖరి టీడీపీలోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఆసక్తి రేపుతోంది. 2019 ఎన్నికల్లో జగన్ హవాను తట్టుకొని మరీ ఆయన విజయం సాధించారు. అయితే, ఆ తర్వాత నుంచి గడచిన మూడేళ్లలో పార్టీ కీలక కార్యక్రమాల్లో పాల్గొన్న సంఘటనలు చాలా తక్కువ. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్రలో చేపట్టిన కొన్ని కార్యక్రమాలకు కూడా ఆయన డుమ్మా కొట్టిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో తాను విశాఖలో లేకపోవడం వల్లే ఆయా ప్రోగ్రామ్స్ లో పాల్గొన లేకపోయానని ఆయన చెబుతుంటారు. ఇక గతంలో ఆయన వైసీపీలో చేరతారంటూ పెద్ద ఎత్తున ఊహాగానాలు వెలువడ్డాయి. అలాగే, జనసేన వైపు కూడా ఓ లుక్కేసి ఉంచారని కూడా ప్రచారం జరిగింది. అదే సమయంలో, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను వైజాగ్ లో ఘనంగా నిర్వహించి షాక్ ఇచ్చారు ఆయన. ఆ తర్వాత మళ్ళీ సైలెంట్ అయిన గంటా శ్రీనివాసరావు మరోవైపు కాపు సామాజిక వర్గ నేతల మీటింగ్స్ లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, అదంతా పార్టీలకు అతీతంగా జరిగే కార్యక్రమం అని ఆయన అంటున్నారు. భీమిలి, అనకాపల్లి, విశాఖ సౌత్ ఇలా ఎక్కడ నుండి పోటీ చేసినా గంటా శ్రీనివాసరావు గెలుపు మాత్రం పక్కా. ఇది ఇప్పటికీ ఆయన ప్రత్యర్థులకు ఓ మిస్టరీ. ప్రజారాజ్యం నుండి కాంగ్రెస్ కూ.. ఆ తర్వాత టీడీపీ ఇలా అన్ని పార్టీలనూ చుట్టేసిన గంటా ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్నారు. అయితే, గడచిన మూడేళ్ళలో టీడీపీ చేపట్టిన వైసీపీ వ్యతిరేక కార్యక్రమాల్లో ఆయన స్వయంగా పాల్గొన్న సందర్భాలు చాలా అంటే చాలా తక్కువ. అయినప్పటికీ గంటా పై తెలుగుదేశం హై కమాండ్ బహిరంగంగా సీరియస్ అయిన సందర్భాలు లేవు. ఆర్థికంగానూ, సామాజికంగానూ బలవంతుడైన గంటాను పార్టీ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కోల్పోవడం ఇష్టంలేక పోవడమే దీనికి కారణం అని విశ్లేషకులు చెబుతున్నారు. చివరికి, వారం క్రితం చంద్రబాబు పిలుపు మేరకు టీడీపీ చేపట్టిన రిషికొండ సందర్శన - నిరసనల కార్యక్రమానికి సైతం గంటా దూరంగా ఉన్నారు. అయితే సడన్ గా టీడీపీకే చెందిన మరో సీనియర్ నేత అయ్యన్న పాత్రుడు అరెస్ట్ విషయంలో ఆయనకు అండగా నిలుస్తూ.. సోషల్ మీడియాలో ఆ అరెస్ట్ ను ఖండించారు. నిజానికి వీరిద్దరి మధ్య పార్టీలో సఖ్యత లేదు అనే ప్రచారం ఉంది. అలాంటి సమయంలో ఒక్కసారిగా అయ్యన్న అరెస్ట్ ను ఖండిస్తూ గంటా శ్రీనివాసరావు స్పందించడం.. అదీ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చాలా ఏళ్ల తర్వాత కావడంతో ఒక్కసారిగా ఏపీ రాజకీయాల్లో మళ్లీ చర్చలోకి వచ్చారు గంటా శ్రీనివాసరావు. రానున్న రోజుల్లో గంటా శ్రీనివాసరావు మరిన్ని ఆసక్తికర పరిణామాలకు కారణం అవుతారో చూడాలి.

# మారని ఏపీ సీఐడీ వైఖిరి

విజయవాడ, నవంబర్ 5, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడును తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేయడం సంచలనం సృష్టించింది. అప్పటి వరకూ ఆయనపై ఫలానా కేసు నమోదయిందని కానీ ఆ కేసులో అరెస్టులు చేస్తారని కానీ ఎవరూ ఊహించలేదు. అరెస్ట్ చేసి తీసుకెళ్లిన తర్వాతే బయట ప్రపంచానికి తెలిసింది. ఆయన ఏ కేసు పెట్టారో కూడా అప్పుడే తెలిసింది. రెండు సెంట్ల స్థలం ఎన్వోసీని అయ్యన్న, ఆయన కుమారులు ఫోర్జరీ చేశారని కేసు పెట్టారు. ఇలాంటి కేసులు తేలాల్సింది సీఐడీలో కాదు. కానీ తమకు ఫిర్యాదు చేశారు కాబట్టి అరెస్టులు చేశామని సీఐడీ అధికారులు ప్రకటించారు. అసలు ఆ ఎన్వోసీ ఫోర్జరీ అని ఎవరు తేల్చారో కూడా చెప్పలేకపోయారు. చివరికి రిమాండ్ కూడా మేజిస్ట్రేట్ఇవ్వలేదు. దీంతో సీఐడీపై మరోసారి విమర్శలు రావడానికి కారణంఅయింది. అయ్యన్న పాత్రుడ్ని అరెస్ట్ చేయడానికి సీఐడీ చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. గుంటూరు జిల్లా నర్సరావుపేటలో కోడెల విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగంపై కేసులు నమోదు చేశారు. అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. ఆ తర్వాత కూడా పలు సందర్భాల్లో ఆయన ఇంటి చుట్టూ పోలీసులువోహరించారు. కానీఅయ్యన్ననుఅరెస్ట్ చేయలేకపోయారు. దాదాపుగా అన్ని కేసుల్లోనూ ఆయన కోర్టు నుంచి రక్షణ పొందారు. తనపై పది కేసులు నమోదు చేశారని.. అందులో నిర్భయ కేసు కూడా ఒకటని అయ్యన్న ప్రభుత్వ తీరుపై తరచూ విమర్శలు చేస్తూ ఉంటారు.

## విద్యార్థిని ని సన్మానించిన సర్పంచ్

కమాన్ పూర్ మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన పల్లెం పద్మ సత్యనారాయణ ల కుమార్తె రమ్యను శనివారం సర్పంచ్ గంట పద్మ వెంకట రమణా రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. రమ్య కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో జరిగే స్టాఫ్ సెలక్షన్ కమిటీ సిజిఎల్ 2020లో టాక్స్ అసిస్టెంట్ ఇన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరక్ట్ టాక్స్ గా ఉద్యోగం పొందింది. ఆల్ ఇండియా లెవెల్ లో 21 లక్షల మంది పరీక్ష రాయగా 4378 ర్యాంక్ సాధించిన సందర్భంగా సర్పంచ్ సన్మానం చేశారు. ఉద్యోగం పొందిన రమ్యకు కల్వచర్ల గ్రామస్తుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. రమ్యను ఆదర్శంగా తీసుకొని గ్రామంలోని యువత కష్టపడి శ్రమించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేము కనకయ్య, ముప్పిడి రమేష్, మైదం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలిచ్చారు.. నిర్మాణం మరిచారు: జనసేన



అల్లూరి సీతారామరాజు అరకులోయ మండలంలోని మాదల పంచాయతీ పరిధిలో గల ముసిరిగూడ గ్రామంలో శనివారము జనసేన పార్టీ మాజీ ఎంపిటిసి సాయిబాబా దురియా. మాదల శ్రీరాములు. అల్లంగి రామకృష్ణ. మత్స్యరాజు తదితరుల ఆధ్వర్యంలో ఆయా గ్రామంలో పర్యటించి ముందుగాను గ్రామస్తులతో సమవేశమై గ్రామంలో నెలకొన్న సమస్యల మీద చర్చించారు. జనసేన మాటలు జనసేన సిద్ధాంతాలు గిరిజనుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆ యొక్క గ్రామంలో వైయస్సార్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్ల ఇచ్చి నేటి వరకు ఇల్లు నిర్మించకుండా ఈ ప్రభుత్వం చేతులు దులుపుకుందని తెలిపారు. దీనిపై స్పందించిన జనసేన పార్టీ మాజీ ఎంపీటీసీ సాయిబాబా దురియా. మాదల శ్రీరాములు. రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే గిరిజనులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల పట్టలిచ్చి జగన్ రెడ్డి నాయకత్వంలో ఇల్లు నిర్మించి ఇవ్వకుండా చేతులు దులిపేసుకున్నారని ప్రభుత్వంపై ద్వజమెత్తారు ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనుల పట్ల చిత్తశుద్ధితో సమస్యల పట్ల దృష్టి చారించి సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా కృషి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని. జగన్ రెడ్డి ప్రభుత్వానికి గద్దె దించడానికి రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు కదలిరావాలని, . ఈ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు గ్రామస్తులు. జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో ప్లేట్లెట్స్ దానం చేసిన యువకుడు

రాయచోటి అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న హర్ష వర్ధన్ అనే 14 సంవత్సరాల బాలుడికి (ఎ+) ప్లేట్లెట్స్ అవసరం అని పేషంట్ కుటుంబ సభ్యులు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ను సంప్రదించగా అఫ్జల్ అనే యువకుని ద్వారా అతని ఫ్రెండ్స్ వెంటనే స్పందించి దీప బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి ప్లేట్లెట్స్ దానము చేయించిన హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ జన వికాస్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు నేషనల్ బ్లడ్ ప్రమోటర్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ కమిటి సభ్యులు నవ్వాజ్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



# ఆళ్లగడ్డలోవీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు

### కాళికామాత ఆలయంలో పూజలు నిర్వహించినరవీంద్ర చారి దంపతులు



ఆళ్లగడ్డ కలియుగ దైవంజగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 414వ అవతరించిన పవిత్ర సుదినం (పుట్టినరోజు) సందర్భంగాప్రముఖ శిల్పి దురూ గడ్డ రవీంద్ర అచారి దంపతులు పూజలు నిర్వహించారు. శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోనీ శ్రీ శ్రీ శ్రీ కాళికామాత దేవాలయంలో వెలసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం నందు దేవాలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ విల్లనూరు చంద్రశేఖర ఆచారి ప్రాతఃకాల పూజలు అభిషేకము ఆలయ కమిటీ అధ్యక్షుడు శిల్పి దురగడ్డ రవీంద్రచారి. సావిత్రి దంపతుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు వితరణ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ దేవదేవుడు వీర బ్రహ్మేంద్ర స్వామి పవిత్రజయంతి సందర్భంగా తాము పూజలో పాల్గొనటం తమ అదృష్టం గా భావిస్తున్నాం మన్నారు. ఆయన మానవాళికి చిరస్మరనేయుడు. ఆయన రచించిన కాలజ్ఞాన తత్వాలు ఇప్పటికీ నగ్న సత్యాలుగా వెలుగొందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విజయకుమార్ఆచారి. ప్రధాన కార్యదర్శి చిన్న పుల్లయ్యఆచారి. గౌరవ సలహా సభ్యులు బాణాల గోపాల్ఆచారి. కమిటీ సభ్యులు రవికుమార్ ఆచారి. బాలఆంజనేయులుఆచారి. యువజన సంఘం కమిటీ సభ్యులు డి హరికృష్ణఆచారి. పృద్విఆచారి. లోకేశ్వర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మంగళ కైశిక ద్వాదశి వేడుకలు

ఆళ్ల గడ్డ :ద్వాదశి విశిష్టతను తెలుపుటకై తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మంగళకైసిక ద్వాదశి కార్యక్రమంలో భాగంగా ఆళ్ళగడ్డ పట్టణంలోని శ్రీ రామాలయం నందు మంగళ కైసిక ద్వాదశి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, శ్రీవారికి విశేష పూజ అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బత్తుల శేషపాములేటి, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.వి. వీరాంజనేయరావు, దాస కమ్యూనిటీ సంఘం సభ్యులు ఒ.తిరుమలయ్య, చెన్నకేశవ పరియోజన ప్రముఖ్ పి రామ నరసింహులు, , వై బాల శేషయ్య, జె. మల్లికార్జున, బి.ప్రసాదు పుల్లయ్య, గురు రెడ్డి పద్మావతి , పద్మలత, వెంకటలక్ష్మి , శ్రావణి, లక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నాడు నేడు పనులతో సంక్షేమ హాస్టళ్లకు గురుకుల పాఠశాలలకు మహర్దశ



### నాణ్యమైన మెను, ఇంగ్లీష్ మీడియంతో మెరుగైన విద్య: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిఏపీ స్టడీ సర్కిల్ ను సందర్శించిన మంత్రి

తిరుపతి, ,నవంబర్05: నాడు నేడు పనులతో సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు గురుకుల పాఠశాలకు మహర్దశ వస్తోందని, నాణ్యమైన మెను, ఇంగ్లీష్ మీడియం విద్య తో విద్యా వ్యవస్థలో దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంచి సంస్కరణలు తెచ్చి అభివృద్ధి చేస్తున్న ఘనత గౌరవ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారిది అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం ఉదయం స్థానిక పద్మావతి అతిథి గృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ నాడు నేడు కార్యక్రమం కింద రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో టాయిలెట్ల వసతి కాంపౌండ్ వాల్సు ఏర్పాటు మరియు తదితర మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించి వాటిని ఆహ్లాదకరమైన మంచి వాతావరణంలో విద్యార్థులు ఉండేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. తాను కూడా సంక్షేమ హాస్టళ్లలో ఉండి చదువుకున్నానని, అప్పుడు ఇంత మంచి వసతులు ఆహారం ఉండేవి కాదని, నేడు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వేల కోట్లతో సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాల లు వాటిలో నాణ్యమైన విద్య కొరకు బడ్జెట్ కేటాయించి ఖర్చు చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వ భవనాల్లో 50% పైగా నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తున్నామని, నాణ్యమైన ఆహారం అందించే దిశగా మెను ఏర్పాటు చేసామని విద్యార్థులు ఆరోగ్యంగా ఉండే విధంగా డైట్ ఛార్జీలు పెంపుదలపై సమీక్షిస్తున్నామని, ఇంగ్లీష్ మీడియం విద్యతో బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడగలిగే పోటీ ప్రపంచంలో నిలబడగలిగే విధంగా వినూత్నంగా, సర్వాంగ సుందరంగా హాస్టల్లను సంక్షేమ గురుకుల పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. ఎస్సి ఎస్టి బిసి మైనారిటీ ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టల్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ వేసి తదుపరి చర్యలు తీసుకోబోతున్నమని అన్నారు. ఈ ప్రభుత్వం బడుగు బలహీనర్గాలకు అండగా నిలబడే ప్రభుత్వం అని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం చెన్నారెడ్డి కాలనీ లోని ఏపీ స్టడీ సర్కిల్ ను మంత్రి సందర్శించి అక్కడ విద్యార్థులతో వారి చదువు మరియు వసతి సౌకర్యాలకు సంబంధించిన విషయాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య తదితరులు ఉన్నారు.

# వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్... దాసి సుధాకర్ రెడ్డి



నందికొట్కూర్ ,నవంబర్. 05 నందికొట్కూరు పట్టణంలో ఎన్నో ఏళ్లుగా వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ కిషోర్ వార్డులలో పర్యటిస్తూ పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. శనివారం పట్టణంలోని మూడు, 24 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలోని వార్డులలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత కలిగిన సమస్యలకు నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర సాఫ్ట్ చైర్మన్ వైసీపీ రాష్ట్ర పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ప్రభుత్వం నుండి మంజూరు చేయించడం జరిగిందన్నారు. రెండు కోట్ల ఆరు లక్షలు నిధులతో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో నందికొట్క మున్సిపాలిటీని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ వార్డు పర్యటనలో మూడవ వార్డు కౌన్సిలర్ అల్లూరి కృష్ణ ,24వ వార్డు కౌన్సిలర్ చాంద్ భాషా ,మున్సిపల్ ఏఈ భాను, సచివాలయ ఎనిమిటిలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# నాయి బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహమునకు మరియు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారాన్ని అందించాలని.. నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి,

### కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి కోరిన...

### ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నాయి బ్రాహ్మణ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ నారాయణ స్వామి ప్రకాష్,

నంద్యాల నవంబర్ ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల జిల్లాలైన స్థానిక నంద్యాల పట్టణంలో నాయి బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (నోపా) సేవా సంఘం ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణ హ్మణ విద్యార్థి (హాస్టల్) వసతి గృహము మరియు కమ్యూనిటీ హాల్ కర్నూలు పట్టణంలో నిర్మాణానికి సహకరించాలని, నంద్యాల జిల్లా ఎంపీ పోచ బ్రహ్మనందరెడ్డి గారిని, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారిని, మరియు ఉమ్మడి జిల్లా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ గారిని, మర్యాదపూర్వకంగా పూలమాలలతో, పుష్పగుచ్చములు సమర్పించి కోరిన కర్నూలు జిల్లా నాయి బ్రాహ్మణ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ పూర్వము నాయి బ్రాహ్మణులు అంటే సాక్షాత్ మహావిష్ణు స్వరూపమైన ధన్వంతరి స్వామి వంశస్థులుగా, వైద్యులుగా, మరియు త్యాగరాజు స్వామి నాద బ్రహ్మలు గా పిలువబడే వారు, కానీ కాలక్రమేణా, వారు శుభానికి, అసభానికి, వెళ్లి కర్మలు చేయడం వలన వారిని, చిన్నచూపు చూసి చులకన భావంతో మాట్లాడే వారిని, మంగళ కారులు, బదులుగా మంగలోడు, మంగలిది, బొచ్చు కొరిగేవాడు, అని నీచ భావనతో దుర్భాషలాడేవారు, ఇప్పుడు మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 50 అంటే ఎవరైనా సరే మంగలిది, మంగలోడు, బొచ్చు కరిగేవాడు అనే మాటలు నిషేధించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం వల్ల మాకు ఒక సముచిత స్థానం, ఏర్పడరమే కాకుండా, మళ్లీ పూర్వ వైభవం

# అరుదైన వ్యాధులతో బాధపడుతున్న అందాల భామలు వీరే..!



వెండితెరపై అందాలతో ప్రేక్షకులకు కనువిందు చేసే చాలా మంది గ్లామరస్ హీరోయిన్లు.. తెర వెనుక అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నారు. లగ్జరీ లైఫ్ ని ఎంజాయ్ చేస్తుంటారని అనుకుంటాం కానీ.. వారు కూడా రకరకాల సమస్యలతో బాధ పడుతుంటారు. చాలా మంది ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు.మనుషులన్నాక పలు రకాల వ్యాధులు రావడం సహజమే. కొన్ని మందులతో నయమైతే.. మరికొన్ని మాత్రం ఎన్ని మందులు వాడినా జీవితాంతం దీర్ఘకాలికంగా వెంటాడుతూనే ఉంటాయి. వారిలో కొందరు చికిత్స లేని ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా ఉన్నారు.ఇటీవల సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు తాను మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించడం అందరికీ షాకింగ్ గా మారింది. ఇది కండరాల క్షీణతకు సంబంధించిన ఆటో ఇమ్యూన్ డిజార్డర్ అని తెలుస్తోంది.మయోసైటిస్ అనేది సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ఇది అత్యంత ప్రమాదకరంగా మారే వ్యాధి అని వైద్యులు చెబుతున్నారు. పదేళ్ల క్రితం సమంత పాలీమార్ఫస్ లైట్ ఎరప్షన్ అనే చర్మ సంబంధించిన వ్యాధితో బాధపడినట్లు తెలుస్తోంది.సినీ ఇండస్ట్రీలో సమంత తో పాటుగా అరుదైన వ్యాధులతో పోరాడుతున్నవారు చాలామంది హీరోయిన్లు ఉన్నారు. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా చాలాకాలంగా స్కిన్ అలర్జీ ప్రాబ్లమ్ తో బాధ పడుతున్నట్లు టాక్ ఉంది.గోవా బ్యూటీ ఇలియానా సైతం డిమ్ మార్ఫిక్ బాడీ డిజార్డర్ అనే అరుదైన వ్యాధిని ఎదుర్కొంది. సోనమ్ కపూర్ కు డయాబెటిస్ ఉంటే.. కియారా అద్వానీకి బర్డ్ ఫోబియా ఉంది. స్నేహ ఉల్లాల్ కూడా ఒకరకమైన ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ని ఫేస్ చేసిందని తెలుస్తోంది.బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె చాన్నాళ్ళు డిప్రెషన్ తో బాధ పడింది. ఎంతో కష్టపడి డిప్రెషన్ నుంచి బయటపడింది. ప్రస్తుతం లైవ్ లవ్ లాఫ్ అనే సంస్థ సహాయంతో దీపికా పదుకొనే డిప్రెషన్ తో బాధపడే వాళ్లకు చికిత్స అందేలా చూస్తోంది.హీరోయిన్ అనుష్క శర్మ కూడా మానసిక ఆరోగ్య సమస్యతో బాధ పడుతోందని టాక్. పరిణీతి చోప్రా కూడా గతంలో డిప్రెషన్ నుంచి బయట పడింది. ఇక సోనాలి బింద్రే - మమతా మోహన్ దాస్ - మనీషా కోయిలారా - గౌతమి - మహిమా చౌదరి - లిసా రే వంటి పలువురు హీరోయిన్లు ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో పోరాడి జయించారు.

# పుష్ప 2 తగ్గేదేలే.. సుక్కు ప్లాన్ అదుర్స్..!

బాక్సాఫీస్ రికార్డుల్లో తగ్గేదేలే అంటూ రిలీజైన అన్ని చోట్ల వసూళ్ల బీభత్సం సృష్టించిన సినిమా పుష్ప ది రైజ్. తెలుగులో భారీ అంచనాలతో రిలీజైన ఇక్కడకు ఈక్వల్ గా హిందీలో ప్రభంజనం సృష్టించింది పుష్ప 1. పుష్ప రాజ్ మాస్ యాటిట్యూడ్ నార్త్ ఆడియన్స్ కి బాగా ఎక్కేసింది. అందుకే ఈ సినిమా అక్కడ 100 కోట్ల దాకా కలెక్ట్ చేసింది. పుష్ప 1 కొట్టిన రికార్డుల వల్ల పుష్ప 2 మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ అంచనాలను అందుకునేందుకు సుకుమార్ అండ్ టీం బాగా కృషి చేస్తుంది. పుష్ప 2 సినిమా ఈమధ్యనే సెట్స్ మీదకు వెళ్లినట్టు కెమెరా మెన్ షేర్ చేసిన ఫోటోతో తెలిసింది.ఇక ఈ సినిమా విషయంలో మొదటి నుంచి సుకుమార్ సూపర్ స్కెచ్ వేసినట్టు తెలుస్తుంది. పుష్ప 1 సినిమా ఇండియన్ ఆడియన్స్ ని మాత్రమే కాదు వరల్డ్ సినీ ప్రియులను అలరించింది. అందుకే వరల్డ్ వైడ్ గా కూడా పుష్ప 1 రికార్డులు సృష్టించింది. అందుకే వరల్డ్ సినీ లవర్స్ కి నచ్చేలా పుష్ప 2 తెరకెక్కిస్తున్నారట. అయితే సినిమాని మొదటి నుంచి ప్రమోట్ చేసేలా మొదలు పెట్టడమే ఆలస్యం ఓ స్పెషల్ టీజర్ గ్లింప్స్ రెడీ చేస్తున్నారట. పుష్ప 2 ఫస్ట్ గ్లింప్స్ కోసం రామోజి ఫిల్మ్ సిటీలో ప్రత్యేకమైన సెట్ లో ఈ షూటింగ్ చేస్తున్నారట.ఇక్కడ మరో విశేషం ఏంటంటే డిసెంబర్ 16న రిలీజ్ అవుతున్న అవతార్ 2 తో పాటుగా పుష్ప 2 గ్లింప్స్ వదలాలని చూస్తున్నారు. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన మరో అద్భుత సృష్టి అవతార్ 2. ఆ సినిమా కోసం ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఎక్సయిటింగ్ గా ఎదురుచూస్తున్నారు.

# మరో రసవత్తర సమరం.. సెమీస్‌కు ఇంగ్లండ్.. ఆస్ట్రేలియాకు శృంగభంగం



టీ20 వరల్డ్‌కప్-2022లో గ్రూప్-1 సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఈ గ్రూప్ నుంచి న్యూజిలాండ్ తొలి జట్టుగా సెమీస్‌కు చేరుకోగా.. ఇవాళ (నవంబర్ 5) జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై గెలుపుతో ఇంగ్లండ్ రెండో జట్టుగా సెమీస్‌కు అర్హత సాధించింది.ఫలితంగా సెమీస్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఆతిధ్య ఆస్ట్రేలియాకు శృంగభంగం ఎదురైంది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక గెలిస్తే సెమీస్‌కు చేరాలని భావించిన ఆసీస్.. ఇంగ్లండ్ గెలవడంతో సూపర్-12 దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.కాగా, ఆసీస్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. ఓపెనర్ పథుమ్ నిస్సంక (45 బంతుల్లో 67; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) అర్ధసెంచరీతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగుల నామమాత్రపు స్కోర్ చేసింది. లంక ఇన్నింగ్స్‌లో నిస్సంకతో పాటు కుశాల్ మెండిస్ (18), భానుక రాజపక్ష (22) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో మార్క్ వుడ్ 3 వికెట్లు పడగొట్టగా.. స్టోక్స్, క్రిస్ వోక్స్, సామ్ కర్రన్, ఆదిల్ రషీద్ తలో వికెట్ దక్కించుకున్నారు.అనంతరం నామమాత్రమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్.. ఓపెనర్లు జోస్ బట్లర్ (23 బంతుల్లో 28; 2 ఫోర్లు, సిక్స్), అలెక్స్ హేల్స్ (30 బంతుల్లో 47; 7 ఫోర్లు, సిక్స్) ఇచ్చిన మెరుపు ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేక వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఓ దశలో ఓటమి దిశగా కూడా సాగింది. అయితే బెన్ స్టోక్స్ (36 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు) బాధ్యతాయుతంగా ఆడి ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చాడు.ఇంగ్లండ్.. 19.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి, 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక ఓడినా అద్భుతమైన పోరాటపటిమ కనబర్చి ఇంగ్లండ్‌ను దాదాపుగా ఓడించినంత పని చేసింది. లంక బౌలర్లలో లహీరు కుమార, వనిందు హసరంగ, ధనంజయ డిసిల్వా చెరో 2 వికెట్లు పడగొట్టారు.

# అదే జరిగితే భారత్, పాక్ సెమీస్‌కు.. సౌతాఫ్రికా ఇంటికి..!



టీ20 వరల్డ్‌కప్-2022 కీలక దశకు చేరింది. గ్రూప్-1 నుంచి తొలి సెమీస్ బెర్త్ (న్యూజిలాండ్) ఇదివరకే ఖరారు కాగా, శనివారం రెండో స్థానంపై క్లారిటీ వచ్చింది.శ్రీలంకతో కీలక మ్యాచ్‌లో గెలుపొందిన ఇంగ్లండ్ సెమీస్‌లో అడుగుపెట్టింది. లంకపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందిన బట్లర్ బృందం.. గ్రూప్-1 నుంచి రెండో జట్టుగా సెమీస్‌కు అర్హత సాధించింది.ఇక గ్రూప్-2 విషయానికొస్తే..తొలుత ఈ గ్రూప్ నుంచి సెమీస్ బెర్తులు ఈజీగా ఫైనల్ అవుతాయని అంతా ఊహించారు. అయితే చిన్న జట్లైన జింబాబ్వే, బంగ్లాదేశ్‌ల నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురుకావడంతో సెమీస్ రేసు రసవత్తరంగా మారింది. ఈ గ్రూప్‌లో ఇప్పటివరకు (నవంబర్ 5) అన్ని జట్లు చెరో 4 మ్యాచ్‌లు ఆడగా.. నెదర్లాండ్స్ అధికారికంగా, బంగ్లాదేశ్, జింబాబ్వే జట్లు అనధికారికంగా సెమీస్ రేసు నుంచి నిష్క్రమించాయి. పోతే.. సెమీస్ రేసులో మిగిలింది మూడు జట్లు. భారత్ (6 పాయింట్లు, +0.730), సౌతాఫ్రికా (5 పాయింట్లు, +1.441), పాకిస్తాన్ (4 పాయింట్లు, +1.117).ప్రస్తుత సమీకరణలు, అంచనాల ప్రకారమయితే భారత్, సౌతాఫ్రికా సునాయాసంగా సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. భారత్, దక్షిణాఫ్రికా తమ ఆఖరి మ్యాచ్‌ల్లో ఎదుర్కొనబోయే జట్లు (జింబాబ్వే, నెదర్లాండ్స్) చిన్నవి కాబట్టి, పై సమీకరణలు వర్కౌట్ అవుతాయని అందరూ అంచనా వేస్తున్నారు. ఇదే జరిగి.. సెమీస్ రేసులో ఉన్న మరో జట్టు పాక్.. తమ ఆఖరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై భారీ తేడాతో గెలిచినా ఎటువంటి ఉపయోగం ఉండదు.అయితే, పరిస్థితులు తలకిందులై ఏవైనా సంచలనాలు నమోదైందయ్యాయంటే మాత్రం అన్నీ ఒక్కసారిగా తారుమారవుతాయి. సౌతాఫ్రికా.. నెదర్లాండ్స్ చేతిలో ఓడినా, భారత్.. జింబాబ్వే చేతిలో ఓడినా.. ఇవి జరిగి పాక్.. బంగ్లాపై భారీ విజయం సాధిస్తే.. గ్రూప్-2 నుంచి సెమీస్‌కు చేరే తొలి జట్టుగా పాకిస్తాన్, రెండో జట్టుగా భారత్ నిలుస్తాయి. ఒకవేళ సౌతాఫ్రికా.. నెదర్లాండ్స్‌పై గెలిచి, పాకిస్తాన్.. బంగ్లాదేశ్‌పై భారీ తేడాతో గెలిచి, టీమిండియా.. జింబాబ్వే చేతిలో ఓడిందా సౌతాఫ్రికా, పాక్‌లు సెమీస్‌కు వెళ్తాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**